## స్వామి వారి దివ్య సూక్తులు

1. బ్రేవ్‌మని త్రేపే వాడికి కాదయ్యా, ఆకలై కొంగు పట్టేవారికి అన్నం పెట్టాలయ్యా.
2. "సంపూర్ణ విశ్వాసంతో ఇక్కడకొచ్చి ఏదనుకుంటే అది అయ్యేదే గదయ్యా.
3. " అన్ని జీవులలో వెంకయ్య వున్నాడని రాసుకో" అది ప్రతి ఒక్కరికి అనుక్షణము గుర్తుండవలసిన విషయం- సద్గురుడు విశ్వరూపుడనీ సర్వ ప్రాణులను వారే పరి వేష్టించి యున్నారని, ఏప్రాణిని ఆదరించినా, బాధించినా అది సద్గురునికే చెందుతుందనీ అనుక్షణం గుర్తుంచుకొని జీవితాన్ని సాగిస్తేగురుకృప సదా మనకు లభిస్తుంది.
4. " అందరికీ పంట పండించాను, దాన్ని దొంగలుపడి దోచుకోకుండా చూచుకోండి" మనలోని దుర్గుణాలే దొంగలు.
5. "వెంకయ్య పేరుమీద పిడికెడు మెతుకులు పెట్టిన వారికీ, తెచ్చిన వారికి వారి మంచి చెడ్డలన్నీ మనమే చూడొద్దయ్యా'2.
6. "సన్యాసులు ధర్మంగా ఉండటంలో గొప్పేముందయ్యా సంసారంలో ధర్మంగా ఉండటమే గొప్ప"
7. "వడ్డీ విషయంలో కూడ ధర్మంగా ఉండాలయ్యా"
8. "పావలా దొంగిలిస్తే పది రూపాయలు నష్టపోతుండ్లాయ్యా"
9. తప్పుచేసిన సేవకులను శ్రీ స్వామివారు మందలించలేదని తలచినవారితో "పొయ్యే వాళ్ళను పోనిచ్చేదే గదయ్యా" అన్నారు.
10. ముందు ముందు తెడ్డు తగలని అన్నం తింటారయ్యా" అన్నారు.
11. "ఆశబోతే అంతా పోతుందయ్యా".
12. "దారం తెగిపోకుండా చూచుకుంటే నేనెప్పుడూ మీ తోటే ఉంటానయ్యా"



భగవాన్

# శ్రీ వెంకయ్య స్వామి

## గొలగమూడి

# దివ్యలీలలు



సేకరణ : పి. సుబ్బరామయ్య

వెల : ఒక్క రూపాయ

భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారు నెల్లూరుజిల్లా ఆత్మకూరు మండలం నాగుల వెల్లటూరు గ్రామంలో సోంపల్లి పిచ్చమ్మ పెంచలయ్య అను పుణ్యదంపతులకు ప్రదమ పుత్రుడుగా జన్మించారు. జనన తేదీలభించలేదు. 1982 ఆగష్టు తేది 24న మహాసమాది చెందే సమయానికి వీరికి షుమారు నూరుసంవత్సరముల వయస్సు ఉంటుందని అంచనా చిన్న నాటి నుండి ధర్మాత్ముడని ప్రతీతి. ఆటల యందు కూడ అబద్దమాడని సత్యవాది. చిన్న నాటి నుండి వీరిలో దివ్య శక్తులు ప్రకటమయ్యేవి. కాని వాటినెవ్వరూ అప్పుడు గుర్తించలేదు. సేద్యపు పనులు ఎంతో చక్కగా చేసి అందరి ప్రశంశల నందుకొన్నాడు. ఇరవై సం॥వయస్సులో జ్వరమొచ్చి నాలుగురోజులు పడుకొన్నాడు. వింతగా మాట్లాడసాగాడు. మతి చలించిందని నాటు వైద్యాలు భూత వైద్యాలు చేయించినా కుదరలేదు. బిడ్డను కట్టి వేయడం పిచ్చమ్మగారికి ఇష్టంలేక స్వేచ్ఛగా వదలి వేసింది. చాకలియోగం, మంగలి యోగం, జక్కల యోగం డుబుడుక్, డుబుడుక్ అని అరుస్తూ విరామంలేకుండా వీధుల వెంట పరుగెత్తేవాడు. కులభేదం లేకుండా అందరి అన్నంతినేవాడు ఈ కాలంలో అందరూ వీరిని పిచ్చెంకయ్య అని పిలిచేవారు. కొన్నాళ్ళకు హటాత్తుగా ఊరు విడిచి ఎటో వెళ్ళిపోయాడు. వీరి కొరకు తల్లిదండ్రులు కొన్నాళ్ళు వెదికి ఆశవదిలేశారు.

అటు తర్వాత నాలుగైదు సం॥లకు సమీప గ్రామాలలో శ్రీ వెంకయ్యస్వామి అనే పేరుతో దర్శనమిచ్చారు. ఎంతటి మొండివ్యాధినైనా మాట మాత్రం చేతనే నయంచేయ గల్గుచున్నందున అందరికీ పూజనీయుడైనారు. రాత్రింబవళ్ళు ఏమారకుండా అగ్నిగుండం వేసేవారు. తిరిగేటప్పుడు కపిలమోకు ముక్కకు నిప్పంటించి చేతపట్టుకొని నడిచేవారు. తర్వాత కొన్నాళ్ళకు తంబుర మీటుతూ



అగ్నిహోత్రం వేసేవారు. ఆతర్వాత నిరంతరం కాగితాల పై వేలిముద్రలు వేస్తూ అగ్నిహోత్రం సాగించారు. పెన్న బద్వేలు, కోటితీర్థం, పెంచలకోన, గొలగమూడి, ఇనుకుర్తి, కలిచేడు, తలుపూరు మొదలైన గ్రామాలేగాక తిరువళ్ళంగేడు, తిరుపతి, తిరువళ్ళూరు, కంచి మొదలగు దేవస్థానాలను కూడా తమ అగ్నిహోత్రంతో పవిత్రం చేశారు. ఒకప్పుడు ఒక్క రోజుకూడా ఏమారకుండా ఎనిమిది సంవత్సరములు తన నిరతాగ్నిహోతర్రంతో ప్రస్తుతం గొలగమూడిలోనివారి సమాది మందిర ప్రాంతాన్ని పావనంచేశారు. మరలా దేశపర్యటన మొదలుపెట్టారు. మహాసమాదికి మూడు సం॥ ముందు నుండి స్థిరంగా గొలగమూడి పుణ్యక్షేత్రంలో ఉండి అక్కడే మహాసమాది చెందారు. సమాది మందిరమునకు వీరే శంకుస్థాపనచేసి 1981 నాటికే మందిర నిర్మాణం పూర్తి చేయించారు. "వెంకయ్య చాటుకు పోయాక మూడు సంవత్సరములకు ఇక్కడ నెల్లూరు రంగనాయకుల గరుడసేవ లాగ జరుగుతుంది" అని శ్రీ స్వామివారు చెప్పిన మాట అక్షరాలా నిజమైంది. నిత్యం వేలమందికి రెండుపూటలా అన్నదానం జరుగుతుంది. ఎవరి అభ్యర్థనలేకుండానే ప్రతినెలా సరాసరి మూడులక్షల రూపాయల రాబడితో కలియుగ వైకుంఠమై వెలిగిపోతుందీ పుణ్యక్షేత్రము. కలియుగంలో భక్తరక్షణార్థం అవతరించిన శ్రీ షిరిడీ సాయి, శ్రీ అక్కల్ కోట స్వామి, శ్రీ నృషింహసరస్వతికి వీరికి ఎలాంటి భేదంలేదని భక్తుల అనుభవాలు నిరూపిస్తున్నాయి. అనంతమైన వీరి దివ్యలీలలో చాలా స్వల్పంగా ఇక్కడ వ్రాయగలిగాను.

అనుభవం పొందిన భక్తుల అడ్రసులు ఇవ్వబడ్డాయి. శ్రద్ధగలవారు ఆ భక్తులను విచారించి తెలుసుకోవచ్చు. విశ్వాసముగల వారికి కూడా అనుమానపు బీజాలు నాటే వ్యర్థ ప్రసంగాలు త్రాగేనీటిలో విషంకల్పడమే అవుతుంది.

చిట్టేటి రమణయ్య - తలుపూరు యిలావ్రాస్తున్నారు. 1975 సం॥ ప్రాంతంలో నా చంకలలోను, మెడ క్రింద, ప్రక్కలందు శరీరమంతా గడ్డలు లేచాయి. పొదలకూరు, కలిచేడు డాక్టర్ల వల్లనయంకాలేదు. తలుపూరు ఆసుపత్రిలో శ్రీ ఎన్.రామమూర్తి డాక్టరు గారి పేరు ప్రఖ్యాతులు విని అక్కడకు కూడా వెళ్ళాను. శ్రీ రామమూర్తి గడ్డను ఒకచోట ఆపరేషను చేస్తే మరొకచోట కొత్తగా గడ్డలు లేస్తున్నాయి. ఈ విధంగా ఎన్నోసార్లు ఆపరేషను చేసి నా వొళ్ళంతా గడ్డలమయం అయ్యేసరికి డాక్టరు గారు విసిగిపోయి "నీకిక పత్యము అక్కరలేదు. నీయిష్టం వచ్చినవి అన్నీ తినవచ్చు. డాక్టర్లుగా యిక మేమేమి చేయలేము నీ యిష్టము అని చెప్పినారు. నేను నాప్రాణాలపై ఆశవదలి చాలా మానసికబాధతో ఆస్పత్రి బెడ్‌లోనే వున్నాను. అట్టి సంకట పరిస్థితిలో కేతు శంకరయ్య ఆస్పత్రి వంటమనిషి నన్ను శ్రీ స్వామి వారి దగ్గరకు తీసుకు వెళ్ళాడు. అప్పుడు శ్రీ స్వామివారు తలుపూరులో శ్రీ సోమేశ్వర స్వామి దేవస్థానము దగ్గర విడిది చేసియున్నారు. శ్రీ స్వామివారు నన్ను చూచి నాపరిస్థితి విని నాకిలా చెప్పారు. "నీకేమీ గాదు. నీవు తిరువళ్ళూరువెళ్ళి అచట కోనేటిలో మునిగి తలనీలాలు యిచ్చి రాత్రి అచట నిద్రచేసి, తెల్లవారి శ్రీ కాళహస్తికివచ్చి అచట స్వర్ణముఖిలో మునిగి అచట ఆరాత్రినిద్ర చేసి తెల్లవారి తిరుమల వెళ్ళి అచట కోనేటిలో మునిగి ఆరాత్రి అచట నిద్రచేసి తెల్లవారి ఉదయాన్నే యింటికి వచ్చెయ్. ఇంటిలో పిండిదంచి గుగ్గిళ్ళు చేసి ఉదయాన్నే ప్రొద్దుపొడుపున తూర్పు పొలిమేరలో భోంచేసి ఉత్తరం నడచియింటికి వచ్చి తలస్నానం చేస్తే నీ కర్మ పోయి నీ ఆరోగ్యం బాగవుతుంది" అని సెలవిచ్చారు. నేను నిరుపేదను. నాదగ్గర డబ్బులేదు. శ్రీ శంకరయ్యగారే డబ్బులిచ్చి నన్ను శ్రీ స్వామి వారు చెప్పినటుల చేసిరమ్మని పంపినారు.



శ్రీ స్వామివారు చెప్పినటులచేశాక నాగడ్డలన్నీ ఏమైనాయోగాని నాశరీరంపై ఒక్కటి కూడా లేకుండా పోయి ఆరోగ్యవంతుడనయ్యాను. ఆతర్వాతడాక్టరు గారైన శ్రీ రామమూర్తి గారికి కనిపించి శ్రీ స్వామివారి విషయం ఎంతో ఆశ్చర్యంగా చెప్పాను. అందుకు వారు "నీకు దేవుడే డాక్టరైనారు, ఇకనీకు కొదువలేదు" అని శ్రీ స్వామివారి గొప్పతనాన్ని కొని యాడారు. నాకీ విధంగా ప్రాణ బిక్షపెట్టిన శ్రీ స్వామివారి ఋణం నేనేవిధంగాను తీర్చుకోలేను.

---

తలుపూరు చెర్లోపల్లి గ్రామకాపురస్తుడు పెమ్మసాని ప్రసాదు ఇలాచెబుతున్నాడు.

ఒక రోజు మా ఎద్దులు, బండి మా మామగారు గడ్డి తోలుకునేందుకు తోలుకుపోయారు. తలుపూరు సమీపానికి వచ్చి ఒక ఎద్దుకాలుకు ఏమైందో తెలియదుగాని నిలువున పడుకుంది. ఎంత సేపు ప్రయత్నించినా లెయ్యలేదు. లేచినా నడువ లేకుంది. తలుపూరు నుండి మరియొక ఎద్దును తోలుకు వచ్చి గడ్డి బండి యింటికి తోలుకు వచ్చారు. ఆఎద్దు ఎంత ప్రయత్నించినా లేవలేక పోయింది. తిన్నగా యింటికి తోలుకు వచ్చి ఎన్ని వైద్యాలు చేసినా వాతలు వేసినా ఆ ఎద్దునడవలేక పోయింది. ఆసంవత్సరము సేద్యం కూడా బీడు పెట్టుకున్నాము.

మరునటి సంవత్సరం శ్రీ స్వామివారు మాగ్రామం వచ్చియున్నారు. కనకదుర్గ గనికి వెళ్ళాలని శ్రీ స్వామివారి మనుషులు గ్రామమంతా తిరిగినా బండి ఎద్దులు దొరకలేదు. శ్రీ స్వామి వారికి చెపితే ఈ ఊర్లోనే బండి ఎద్దులు ఉన్నాయి. నీవు సరిగ్గా అడగలేదు. కుంటి ఎద్దు వుంది. బండి కట్టి తోలుకురమ్మన్నారు. కుంటి ఎద్దు

ఎవరికి వుండేది తెలియని ఆ సేవకుడు అలావచ్చి ఎదురుపడ్డ నన్ను అడిగాడు. కుంటిఎద్దు ఉండేది మాకే. దాని మూలంగానే సేద్యం బీడు పెట్టాము. అది బండిలాగలేదు. నేలపై కాలు ఆనంచి నడవలేదని చెప్పాను. ఈ విషయం శ్రీ స్వామివారికి చెపితే బండి కట్టి తీసుకురండి. బాగా కాలు తొక్కేస్తుందని శెలవిచ్చారు. వారు చెప్పినట్లు చేస్తే అది కుంటు కుంటూ కనకదుర్గ గనికి బండి లాగింది. శ్రీ స్వామివారికి దాని స్థితిని విన్నవిస్తే "అయ్యా ఎండు చేపలు, కుప్పింటాకు ఆఎద్దుకు పెట్టండి బాగా కాలు తొక్కి నడుస్తుంది" అని సెలవిచ్చారు. అలానే పెడితే ఆ ఎద్దు మరురోజు నుండి చక్కగా నడువసాగింది. సేద్యం చేసింది. శ్రీ స్వామివారి అమృత వాక్కు అలాంటిదిగదా !

---

ఆత్మజ్ఞానులందరూ ఉపమానాలతో బోధించడంలో ఎవరికి వారే సాటి. జ్ఞానమూర్తి యైన శ్రీ స్వామివారు ఎంతో క్లుప్తంగా మాట్లాడినా ఆ కొద్దిమాటలలో వేదాలు ఉపనిషత్తులూ ధ్వనించేవి. ఒకరోజొక సన్యాసి శ్రీ స్వామివారి పాదాలు తాకి నమస్కరించు కుంటానని శ్రీ స్వామివారిని అర్థించారు. అందుకు శ్రీ స్వామివారు.

"అయ్యా! తూముగుండా నీరు పారితే పంటలు పండుతాయి. కానీ చెరువు కట్ట తెగగొడితే పండు తాయా" అన్నారు. అంటే అర్హతకు తగినంత కృపనే పొందాలిగాని అధికంగా ఇచ్చినా దానిని భరించలేరని శ్రీ స్వామివారి భావమన్నమాట, గనుక శ్రమించి అర్హతను సాధిస్తే మన ప్రార్థనతోనిమిత్తము లేకుండానే దైవకృపకల్గుతుందని బోధించారు.

శివుని ఆజ్ఞలేక చీమైన కుట్టదని పెద్దలు చెప్పినట్లే శ్రీ షిర్డిసాయి కూడా తేళ్ళు, పాములను చంపవద్దంటారు. అదేమాటను శ్రీ స్వామివారు కూడ చెప్పడం గమనార్హము. "అయ్యా! తేలుకు కొండె



కత్తిరించకూడదు. పాముకు కోరలుతీయకూడదు" అని సెలవిచ్చారు శ్రీ స్వామివారు.

---

రాగల కండ్రిగ గ్రామం - కారివేట నగరం మండలం, చిత్తూరు జిల్లా అత్తిమాన్ జేరి ఎల్లమ్మ తన అద్భుత గాధ ఇలా వివరిస్తుంది. నాకుమారుడు వెంకటేశ్‌కు 8వ తరగతి చదివాక (13సం॥లో) జ్వరము, తలనొప్పి, వాంతి వచ్చాయి మా ఆస్థి యావత్తు ఐపోయింది. షుమారు 40 వేల రూపాయల ఖర్చు 2 సంవత్సరములు బాధ అనుభవించాము. చిత్తూరు, పుత్తూరు, కార్వేటి నగరం, నగిరి, వేలూరు, అన్ని ఆసుపత్రులకు పోయాము. ప్రయోజనం లేకపోయింది. 14 వందలు ఖర్చుపెట్టి 7మార్లు దాటింపులు పెట్టాము. నాటు మందులేగాక నక్కల వాళ్ళమందులు కూడా వాడాము. బియ్యం కడిగిన కుడితిని 2 నెలలు త్రాగించాను. కణిత మూలిక రుద్దాను. ముష్టిపండు రుద్ది స్నానం చేయించాను. లాభంలేదు. వేలూరులో 10 వేలు పెట్టి వెన్నుపూసలో ఆపరేషను, వెయ్యి రూపాయలు మందులు వాడాను. అస్సలు నడువలేని స్థితికి వచ్చాడు. అన్నం తింటాడు కాని కాళ్ళు స్వాధీనంలో లేక పట్టుకపోయినట్లయి పోయాయి. ఇక ఏమీ చేయలేక బిడ్డ బాధచూడలేక నిస్సహాయ పరిస్థితిలో తల్లిగా ఆబాధచూడలేక ఆత్మహత్య చేసుకోవాలనుకొన్నాను. ఆత్మహత్యకు ఒక విషమయమైన ఆకు నూరి దగ్గర పెట్టుకున్నానేగాని ఆబిడ్డకు ముందు పెట్టి తర్వాత నేను తిని ఇరువురమూ ఈలోకం నుండి వెళ్ళిపోవాలని తలచాను. కాని 16సం॥ బిడ్డకు ఈ మందు ఎలా పెట్టాలో అర్థం కాలేదు. అట్టి విషమ పరిస్థితిలో పరమకారుణ్య మూర్తియైన శ్రీ స్వామివారిని గూర్చి వినియున్నాను. కానీ గొలగమూడికి

ప్రయాణమైన రెండు పర్యాయములు బంధువుల మరణాల వలన రాలేకపోయినాను. ఆత్మహత్య ప్రయత్నసమయములో "అమ్మా నలుగురు మనుషులకు అన్నంపెట్టమ్మా" అనే స్వప్నాదేశం యిచ్చారు. కానీ ఆ ఆదేశం ఒక దయ్యం యిచ్చినదని విశ్వసించాను. కానీ తెల్లవారి అన్నం పెట్టే ప్రయత్నం మానలేక ముగ్గురు వస్తే పెట్టాను. మరి నాలుగవ వ్యక్తి ఏడి రాలేదే అని ఎదురు చూస్తున్న సమయంలో శ్రీ స్వామివారే ఒక ముదుసలిరూపంలో వచ్చి త్రాగేందుకు మంచి నీళ్ళమ్మని అడిగాడు. వారికే అన్నంకూడా పెట్టాను. ఎందుకో తెలియని పూజ్యభావం వారి ఎడల నాకు ఏర్పడి "తాతగారు నాదగ్గర ఒక పైసా లేదు, ఉంటే పది పైసాలైనా యిచ్చే దాన్ని అని చెప్పు కొన్నాను. సరేనని వారు వెళ్ళిన ఒకటి, రెండు నిముషాలలో మా కుమార్తె వస్తే ఆమె దగ్గర తీసుకొని అర్ధరూపాయి వారికివ్వాలని అన్ని వైపులకు పరిగెత్తి చూచాను. ఎక్కడా వారి జాడేలేదు. ఆ విధంగా నా స్వప్నాదేశం ఫలించి మరురోజునుండి ఆత్మహత్యకొరకు వుంచుకొన్న విషమూలిక పారవేశాను. గొలగమూడి వెళ్ళాలనే తపన మొదలైంది. చివరకు మా అల్లుని తీసుకొని గొలగమూడి వచ్చేశాను. ఈ పుణ్యభూమి ప్రభావమేమో నేను వివరించలేను. కాని తిరిగి యింటికి పోవాలనే కోరిక సంపూర్ణంగా నశించింది. అల్లుడు తిరిగి వెళ్ళి పోయాడు. అప్పటి బిడ్డ పరిస్థితి పరమ దయనీయంగా వుంది. 16సం॥ బిడ్డ బలిష్టంగానే యున్నాడు. బొత్తిగా కూర్చున్న చోట నుండి కదలలేడు. నిత్యం ఇద్దరు మనుషుల సహాయంతో స్నానం చేయించి శ్రీ స్వామివారి మందిరంలో ఒకటి, రెండు నిముషాలు కూర్చోపెట్టి తిరిగి సుబ్రహ్మణ్యం స్వామివారి దేవస్థానం దగ్గర కూర్చోబెట్టు కొనేదాన్ని. అంత పెద్దబిడ్డకు మల మూత్ర విసర్జన దగ్గరనుండి సర్వము నేనే చేయాలి. వేకువ జామున



3గం॥లకే లేచి వానైనాసరే ప్రదక్షిణలు నిత్యం 108 చేస్తున్నాను. భోజన శాలలో పనిజేస్తే ఇద్దరికి బోజనం పెడుతున్నారు. మరొక చోట పాచిపనిచేసి నెలకు 25రూ॥ తెచ్చుకొని సబ్బు, వక్కాకు వెళ్ళబుచ్చేదాన్ని. ఒక రోజు నేను చేయని నేరానికి అనుమానంతో భోజనశాలకు రానియ్యలేదు. 2 రోజులు పస్తు. ఎవరో యాత్రికులు కొద్దిగా అన్నంపెడితే అది బిడ్డకు పెట్టుకొన్నాను. కానీ ఎంత బలహీనమైనా ప్రదక్షణలు ఎలా చేశానో చేసేశాను. పుట్టెడు ద:ఖము. శ్రీస్వామి వారిపై నిష్టూరపడి ఏడ్చేదాన్ని. మా దేశంలో వుండే నన్ను ఇలా ఇక్కడకు తీసుకొచ్చావే, ఈ విధంగా బిడ్డను పస్తులు మాడ్చి నాకు కడుపు మంట పెట్టేందుకేనాస్వామీ. మీకు కష్టమెందుకు, మమ్ముల నిద్దరినీ ఒకేసారి చంపెయ్యండి. నాకష్టాలు తొలగిపోతాయి. అని చెప్పుకొని ఏడుస్తున్నాను. ఆదయామయుడు కరుణించి ఒకచోట పని యిప్పించాడు. అదిమొదలు కొని చస్తేయిక్కడే చావాలి, తిరిగి యింటికి మాత్రం పోయేదిలేదు. అక్కడ బంధువులకు బరువై చులక నవడం ఎందుకు? అనే తీవ్రనిర్ణయమే నన్నుద్ధరించింది.

గొలగమూడి లోనాబిడ్డ సుబ్రహ్మణ్యం స్వామి పుట్టదగ్గర అశుభ్రం చేస్తున్నాడని ఎందురు ఎన్ని మాటలన్నారో చెప్పలేను. అన్నీ సహించి నోరు విప్పేదిలేదు. ఒక నెల, రెండు నెలలుగాదు షుమారు 2 సంవత్సరములు ఈ పుణ్య భూమిలోనే మరణిస్తానని తీవ్ర పట్టుదలతో నిస్సహాయంగా నిలువను నీడ లేకుండా ఉన్నాను. ఒకరోజు శ్రీ స్వామివారు న్వవ్నదర్శనమిచ్చి "గ్రహాలు పట్టియున్నాయమ్మా". అని సెలవిచ్చారు. మరొక రోజు ఒక ఎర్రకాగితం ఒక పచ్చకాగితం యిచ్చారు. మొదటి నుండి కూడా పిల్లవానికి అంగవైకల్యం తోటి మెంటల్ కూడా వచ్చి అందరినీ తిట్టేవాడు. నిష్కారణంగా

అరుస్తుండేవాడు. చిన్నగా రెండు సం॥లకు మహనీయమూర్తి దయతో క్రమంగా కర్రపూతతో నడువగలుగుచున్నాడు. మెంటల్ చాలా తగ్గింది. కానీ పూర్తిగా పోలేదు. కానీ చింతలేదు. కారణం నాబిడ్డ తన పనులను తాను చేసుకోగల్గి కొంతదూరం కర్రతో నడువగల్గుచున్నాడు ఆబిడ్డ సంపూర్ణంగా నడచినా నేను ఆగ్రామం వదలి వెళ్ళేది లేదు. ఆపుణ్యమూర్తే నాబిడ్డను నన్నూ చాకుతున్నాడు. నాకు లోటేది?

ఒక సారి నా చేతి చూపుడు వ్రేలులో గోటిక్రింద ముల్లు గుచ్చుకొని సెప్టికయి వేలునుండి మోచేతివరకు వాపు, డాక్టర్లు వ్రేలు తీసేస్తామన్నారు. ఒకే తూరి చావాలనుకున్న నేను ఏ వైద్యము లేకుండా కూర్చున్నాను. అట్టి నిర్ణయమే నన్ను కాపాడింది. ఆనొప్పి, వాపు ఎలా తగ్గిపోయాయో పోయాయి. నాశేషజీవితానికి ఏమీ అక్కరలేదు. నాస్వామివారి కృపతప్ప. శ్రీ స్వామివారిని సేవిస్తూ గొలగమూడిలోనే జీవితాంత ఉండదలచాను.

మానవ మాత్రులందరూ నలభైరోజులు, కాకుంటే మూడునెలలు శ్రీస్వామివారిసన్నిధిలో ఉండేందుకు ఎంతో బాదపడి పోతారు. అంతకాలం ఉండేసరికి శ్రీ స్వామివారు మనకునయం చేయడు అని తలుస్తారు. కాని ఈమె తన విశ్వాసానికి నిదర్శనగా రెండు సంవత్సరాలు అకుంఠిత శ్రద్ధతో ప్రదక్షిణలు చేసి శ్రీ స్వామివారి కృపను దోచుకొన్న మహనీయురాలు. ఈమె శ్రద్ధ, భక్తులు, విశ్వాసానికి నా హృదయపూర్వక ప్రణామములు.

---

శ్రీ బి.సుబ్రహ్మణ్యంగారు బస్ కండక్టరు- పనబాక గ్రామం. పాలవాకం (పి.ఓ), ఊతుకోట తాలూకా చెంగయ్య ఎమ్.జి.ఆర్. జిల్లా తమిల్‌నాడు స్టేట్, ఇలావ్రాస్తున్నారు.



నాకు 1995 అక్టోబరు ప్రాంతంలో నడుం ప్రక్క నొప్పి వచ్చింది. బస్సులో పనిచేయలేకున్నాను. ఇద్దరు, ముగ్గురు డాక్టర్లు వందలు ఖర్చుపెట్టించారు. కానీ నొప్పి తగ్గలేదు. ఇక లాభంలేదని బాధ భరించలేక మద్రాసు వెళ్ళాను. అక్కడ డాక్టరు లోపల స్టోన్సు ఉన్నాయని అవి మందులతో పోతాయని మందులిచ్చారు. స్కానింగ్ చేశారు. షుమారు 10 వేలరూపాయలు ఖర్చుపెట్టినా నాబాధ పోలేదు. ఇక లాభంలేక బాధ భరించలేక అపోలో ఆసుపత్రికి వెళ్ళి ఆపరేషను చేయించదలచాను. డాక్టర్లు 25 వేలు రూపాయలు అవుతుందన్నారు. నాపరిస్థితి చెప్పుకొని పదిహేను వేలు లోపు అప్పుతెచ్చి సమర్పించుకొంటానని వారిని ఒప్పించాను. డబ్బుకొరకు యింటికి వస్తే మాగ్రామములో అన్ని వైద్యాలు విఫలమై చావనున్న ఒకతనిని శ్రీ గొలగమూడి వెంకయ్య స్వామివారు రక్షించారు. అతను ఆరోగ్యంగా వుండి నన్ను బలవంతం చేసి గొలగమూడి పంపాడు. వచ్చినాక కొంత నెమ్మదించింది. 4వరోజు 6వరోజు కూడా నొప్పి వచ్చింది. కనీసం నెల్లూరు వెళ్ళి డాక్టరుకు చూపాలనుకొని బస్సుదగ్గరకు వెళ్ళాను. ఇతరుల సలహాపై ప్రయాణం విరమించుకొన్నాను. ఇంటికి పోవాలను కొన్నాను. 11 రోజులైనా వుండమన్నారు. 22 రోజులైంది. ఇప్పటికి నొప్పిలేదు. శ్రీ స్వామివారు నాపై కృపజూపారని విశ్వసిస్తున్నాను.

---

నెల్లూరు బాలాజీనగర్-మసీదుసెంటర్ - నివాసి చి॥సౌ॥ దాసరిసుగుణ తన దివ్యానుభవాన్ని ఇలా వివరిస్తుంది. 1992వ సంవత్సరంలో నేను నీళ్ళు తెస్తుండి కాలు జారి పడ్డాను. కుడికాలు విపరీత మైన నొప్పి. నడవలేకున్నాను. నెల్లూరులో పేరు మోసిన డాక్టర్లందరిదగ్గర వైద్యము చేయించాము. కానీ నేను నడువలేకున్నాను.

నాటు వైద్యాలు, భూత వైద్యాలు చేయించాము. ప్రయోజనంలేదు. చివరకు డాక్టర్లు మద్రాసు పొమ్మని సలహాయిచ్చారు. ఆర్థిక ఇబ్బందుల వలన వెంటనే పోలేకున్నాము. మా అమ్మ నాన్నగారికి శ్రీ వెంకయ్య స్వామివారి మీదనమ్మకంలేదు. నా స్నేహితులంతా శ్రీ స్వామివారి దగ్గరకు వెళ్ళమని సలహాఇస్తే మా నాన్నగారు అంగీకరించలేదు. శ్రీ స్వామివారు ఒకరోజు నా స్వప్నంలో కాలికి నూనెపూసి గొలగమూడికివస్తే నయమవుతుందని చెప్పారు. మానాన్నకు ఆస్వప్నవృత్తాంతము చెప్పినా సుతరాము అంగీకరించలేదు. పరమ దయా మయుడైన శ్రీ స్వామివారు రెండవ సారి నాకు స్వప్నదర్శనమిచ్చి మరలా గొలగమూడి రమ్మని చెప్పారు. అంతేగాక అంతవరకు పట్టుదలగాఉన్న మానాన్నగారు గొలగమూడి వెళ్ళేందుకు అంగీకరించేటట్లు చేసి కారులో నన్ను గొలగమూడికి తీసుక పోయారు.

ఇద్దరు మనుషుల సహాయంతో కూడానేను అడుగు పెట్టలేక కన్నీళ్ళు కారుస్తున్నాను. ఎట్లాగో మొదటి రోజు ఒక్క ప్రదక్షిణ, రెండవరోజు రెండు ప్రదక్షిణలు చేశాను. నొప్పి భరించలేక "స్వామి నాబాధనయంచేస్తావా లేక కొనేటిలో పడి చావమంటావా" అని చెప్పుకున్నాను. ప్రేమమయుడైన శ్రీ స్వామి వారు స్వప్న దర్శనమిచ్చి "బాగవుతుందిలేమ్మా" అని ఓదార్చరు. తెల్లవారి పెసల సుబ్బరామయ్య మాష్టరు గారు అవధూత లీల గ్రంథం ఇచ్చి " ఈ గ్రంథం ఎంత బాగా చదివితే అంతబాగా నొప్పి తగ్గుతుందని చెప్పారు. క్రమేణా నొప్పి తగ్గిపోయి ఏ వైద్యం లేకుండానే చక్కగా నడవగలగాను. నలబై రోజులు శ్రీ స్వామివారిని సేవించి ఇంటికి వచ్చాము.

శ్రీ స్వామి వారి మీద నమ్మకంలేని మాతల్లి దండ్రులకు కూడా ఈ సన్నివేశంతో నమ్మకం కుదిరింది. ప్రతి శనివారము ఉపవాసముతో



శ్రీ స్వామివారిని సేవిస్తూ నిత్యం పూజచేసు కునేట్లు చేశారు శ్రీ స్వామివారు. నాకీ చక్కని భక్తి మార్గ మనుగ్రహించిన శ్రీ స్వామివారికి నేనెంతో ఋణపడియున్నాను.

---

ఆలపాటి శ్రీనివాస పూర్ణచంద్రరావు - మచిలీ పట్నం- పేర్ని కృష్ణమూర్తి కాలనీ గవర్ణమెంటు హాస్పిటల్ వెనుక - తన దివ్యానుభవాన్ని ఇలా వివరిస్తున్నారు. వీరి అనుభవం "చచ్చిబూడిదైనా రమ్మంటే వచ్చేదే గదయ్యా" అన్న శ్రీ స్వామివారి మాట అక్షరాల నిజమని సూచిస్తుంది.

1994 వసం॥ నాకుమారుడు నాగ వెంకటచక్రవర్తి నాలుగు సంవత్సరముల పిల్లవాడు. విపరీతమయిన జ్వరం వల్ల మెదడు పెయిలయింది. ఎవరినీ గుర్తించలేదు, ఏమీ తినలేదు, ముక్కు ద్వారా ట్యూబుపెట్టి ద్రువాహారం పోస్తున్నాము. ఇరవైరోజులు ఎమ్.బి.బి.ఎస్. డాక్టరు గారి ఆస్పత్రిలో ఉంచినా ఏమినయంకాలేదు. విజయ వాడకు తీసుకు వస్తే స్కానింగ్ చేయాలని వేల రూపాయలడిగారు. శక్తిలేక ఇంటికి వెళ్ళాము. మచిలీ పట్నం డాక్టర్లు మేమేమీ చేయలేమని ఆశవదిలిశారు. మా స్నేహితుని సలహాపై శ్రీ వెంకయ్యస్వామి వారి బక్తురాలి దగ్గరకు తీసుకు పోతే ఆమె వెంటనే గొలగమూడికి పోండి బాగవుతుందని చెప్పారు గొలగమూడి ఎక్కడుందో, ఎలా పోవాలో, ఎంతఖర్చవుతుందో తెలియక యోచనలో పడ్డాను. శ్రీ స్వామివారి దయవలన అక్కడున్న భక్తులు ఐదువందల రూపాయలిచ్చి వెంటనే గొలగమూడికి వెళ్ళి బిడ్డను బ్రతికించు కోమన్నారు. అది శ్రీ స్వామివారి దయయని గొలగమూడి చేరాను.

అంత స్పృహలేని పరిస్థితిలో నున్నబిడ్డకు తలనీలాలు

తీయించుటకు రెండు గంటలు పట్టింది. పిల్లవాని తలంతా గాయాలే. గాయాలకు విబూతి మాత్రం పూశాను. రెండుగంటలలో ఒక్క గాయం కూడా కనిపించకుండా పోవడమే చిత్రం. తెల్లవారి శనివారం విపరీత మైన రద్దీ. పిల్లవానిని ఎత్తుకొని కూర్చొని యున్నాను. ఒక్క క్షణంలో కళ్ళు మూతలు పడి మందిరం ముందు శ్రీ స్వామివారి దగ్గరున్నాను. ఆకరుణామయుడు కనిపించి "బిడ్డకు బాగుంటుంది, నామార్గంలో నడుస్తావా?" అని అడుగుతున్నాడు. నేను సరేననగానే నాకు మెలుకువ వచ్చింది. తెల్లవారినుండి పిల్లవాడు చిత్రంగా ఇడ్లీ దగ్గరనుండి సర్వం తింటూ చక్కగా నడిచి తిరుగుతున్నాడు. ఇన్నాళ్ళు ఆహారం లేక బలహీనంగా ఉండవలసిన వానికి ఆలక్షణాలే లేవు. ఐదురోజులుండి ఇల్లుచేరాను.

శ్రీ స్వామివారి మార్గంలో ఎలా నడవాలో తెలియక స్నేహితుని సలహా పై శ్రీ స్వామి వారి మాల వేసుకొని నలబైరోజులు దీక్ష చేయాలనుకున్నాను. దీక్షా వస్త్రములతో సాయి మందిరానికి పోయాను. అక్కడ పూజారులు లేక నా మాలనేనే ధరించాలని బాదపడుతున్నాను. పట్టపగలే ఆశ్చర్యంగా శ్రీ స్వామివారు నాముందు కనిపించి "ఆడాలరు నామెడలో వేయయ్యా" అని చెప్పగా అలానే వేశాను. " ఇప్పుడు తీసి నీమెడలో వేసుకో" అన్నారు. అలాగే వేసుకున్నాను. "నలబై రోజులు బిక్షచేసి వచ్చిన డబ్బుతో పచ్చిగడ్డికొని ఆవులకు పెట్టు" అని చెప్పి అదృశ్య మయ్యారు. ఇదంతా స్వప్నం కాదు, పట్టపగలు జరిగిన సంగతి. వారిదయవలన నేనలాగే నలబైరోజులు బిక్షచేసి ఆవులకు పచ్చిగడ్డి పెట్టాను. ఇలాంటి దివ్య అనుభవం ప్రసాదించినన్ను వారి భక్త కోటిలో చేర్చుకున్న శ్రీ స్వామివారికి నేను ఋణగ్రస్తుడను.

---



"ఇక్కడకొచ్చి విశ్వాసంతో ఏమనుకొంటే అది అయ్యేదేగదయ్యా" అన్న శ్రీ స్వామివారి మాట అంతకు ఎన్నోరెట్లెక్కువగా సత్యమని నేడు నిరూపిస్తున్నారు కారణం ఇక్కడకు (గొలగమూడి) రాకుండానే ఎక్కడో ఉండి వారిని ప్రార్ధించినప్పటికీ వారి బాధలు తీరుస్తున్నారు.

1989-90 వసంవత్సరంలో గుంటూరు, ఏ.టి. అగ్రహారం నివాసి శ్రీ మాగులూరి సుబ్బారావు గారి మెడమీద టెన్నిస్ బాలంత కణిత లేచింది అది కాన్సరు గడ్డ అని మద్రాసు వెళ్ళమాన్నారు డాక్టర్లు. మద్రాసు వెళ్ళే ఆర్ధిక స్తోమతలేక శ్రీ రమేష్ గారనే భక్తుని సలహా పై శ్రీ స్వామివారి చరిత్ర పదమూడు సార్లు పారాయణచేస్తున్నాడు. మద్యలోనే ఆగడ్డ మాయమైంది. పదమూడు పారాయణలు పూర్తిచేసి కృతజ్ఞతతో శ్రీ స్వామివారి సమాది దర్శనం చేసుకున్నాడు. గొలగమూడికి రాకుండానే, ఏమందులూ లేకుండానే ఆగడ్డ పూర్తిగా అదృస్యమ యిందంటే నేటికీ శ్రీ స్వామివారు సర్వవ్యాపకులై అన్నిజీవులలోను ఉన్నారని తెలుస్తుంది. ఇదేవిధంగా 1992 సంౢలో శ్రీ పాబోలు పిచ్చయ్యగారి కాన్సరు గడ్డ పోవడం అవధూత లీల లో చివర చూడవచ్చు.

---

పెనవర్తి వాస్తవ్యులు గూడూరు మస్తానయ్య తన అనుభవాలను వివరిస్తున్నారు. శ్రీ స్వామివారు చక్కగా ప్రశ్నలు చెపుతారని ఆరోజులలో ప్రతీతి. రెండు మూడు నెలల క్రిందట నా బర్రెదూడ తప్పిపోయింది. ఒక రోజు శ్రీ స్వామివారి నడిగితే "అయ్యా నీదూడ నీదగ్గరకే వస్తుంది. వెతక బళ్ళేదు" అని సెలవిచ్చారు. ఆతర్వాత రెండునెలలకు నేను మా ప్రాంతంలోని వల్లూరు కాలువగట్టున పోతున్నాను. ఎదురుగా వస్తున్న బర్రెల మందలోని ఒక దూడ నాతొడకు తగిలింది. వెంటనే

నా బర్రెదూడ గుర్తువచ్చి దానికాలు పరిశీలనగా చూచాను. ఆకాలుకు గల మచ్చవలన అదినాదూడేనని గుర్తించి బర్రెలకాపరులకు పది రూపాయలిచ్చి ఇంటికి తోలుకొచ్చాను. ఆదూడ నాతొడ తగలకుంటే నేను దాన్ని పరిశీలనగా చూచే మాటేలేదు. ఈ సృష్టిలో ఆదూడనాతొడ తగలటం వంటి చిన్న విషయం కూడా ముందే నిర్ణయమై ఉంటుందని, అది తెలిసే శ్రీ స్వామివారు "నీదూడ నీదగ్గరకే వస్తుందని" చెప్పారు. గనుక మనం భూత భవిష్యత్తులను గూర్చి ఆలోచనలుమాని మన మనస్సును భగవంతుని స్మరణతో నింపడం నేర్చుకోమని శ్రీ స్వామివారు బోధిస్తున్నారు. దీనినే ఆచార్య శ్రీ భరద్వాజగారు "వర్తమానంలో నివసించడం నేర్చుకోండి" అని చెప్పేవారు.

---

ఈ గూడూరు మస్తానయ్య గారే ఇంకా ఇలా చెపుతున్నారు. ఒక రోజు శ్రీ స్వామివారు నాస్వప్నంలో నాకొక మంత్రముపదేశించి జపించమన్నారు. నేను జపిస్తున్నాను. నన్ను వాయవ్యదిశగా చూడమన్నారు. ఆవైపు మనోజ్ఞమైన వైకుంఠందర్శనమైంది. వారి ఆజ్ఞప్రకారం తూర్పువైపు చూస్తే మబ్బు పట్టిన సూర్యబింబం దర్శనమైంది. "నీకింకా తెగలేదయ్యా" అన్నారు శ్రీ స్వామి, శ్రీ స్వామివారు నన్నువదలి వెళ్ళిపోతున్నారు. నేను భావోద్వేగంలో వారిని వెంబడించ బోయాను. నేను మంచంనుండి క్రిందపడ్డాను. నాస్వప్నం అంతరించింది. అది మొదలు మూడు రోజులు శరీరం మొద్దుబారి మౌనంగా ఉండిపోయాను. ఆతర్వాత మామూలు పరిస్థితి అయింది. ఆతర్వాత ఆరుసంవత్సరములకు నేను చిల్లకూరు స్వామివారి దగ్గర మంత్రోపదేశం పొందాను. చిత్రంగా వారు కూడా నాకు శ్రీ స్వామివారు ఆనాడు నా స్వప్నంలో ఉపదేశించిన మంత్రాన్నే



ఉపదేశించారు. ఈ విధంగానేను తరింపుమార్గం చూచుకోకుండా జాప్యం చేయడమే శ్రీ స్వామివారు "నీకింకా తెగలేదయ్యా" అన్న మాట కర్థమని తెలుస్తుంది.

మిశ్రమ కర్మలు చేసే మానవుడు కేవల శ్రద్ధ, కేవల భక్తి నాశ్రయించి ముందు నిర్ణయాన్ని అధిగమించే ప్రయత్నమే సాధనని పూజ్య పాదులు శ్రీ భరద్వాజ మాష్టరు గారు చెప్పేవారు.

---

శ్రీ కాళహస్తి మండలం, కళత్తూరు నివాసి వేణుమల్లై అనే భక్తుని ప్రాణాపాయ పరిస్థితులలో శ్రీ స్వామివారు రక్షించిన విధం వారిలా వ్రాస్తున్నారు.

శ్రీ స్వామివారితో నాకింతకు ముందు గల కొన్ని అనుభవాలవలన వారు నాజీవితంలో ఆపద్భాంధవుడయ్యారు. 1996 నవంబరునెలలో ఒకరోజు నేను రాళ్ళకళత్తూరు ఏటిలోని కొద్దిపాటి నీటిని దాటి పోతున్నాను. నీటి ప్రవాహం నిమిషాలలో ఎక్కువై నేను నడి ఏటిలో చిక్కుకొని ప్రాణాపాయ స్థితిలో దిక్కుతోచక "స్వామీనన్ను కాపాడు నీవేదిక్కు" అని పెద్దకేకపెట్టాను. కనుచూపు మేరలో అక్కడెవ్వరూలేరు. కానీ చిత్రంగా ఒక నడివయస్కుడు వచ్చి. నారెట్టపట్టుకొని "భయపడవద్దు" అని చెపుతూ నన్ను ఏటి గట్టుకు చేర్చారు. "నీవు భయపడియున్నావు ఆకాలువ దగ్గరుండే చాకలివారు కాలువకూడా దాటిస్తారు పో" అని చెప్పి నా కళ్ళముందే అదృశ్య మయ్యారు ఈ అదృశ్యమవడమనేది జరుగకుంటే నాకు వారు శ్రీ స్వామివారేననే విశ్వాసం కలుగదు గదా. నావిశ్వాసం బలపడేందుకే ఆమహనీయుడు అలాచేసి నాకు ప్రాణబిక్ష పెట్టడమే కాక నావిశ్వాసాన్ని బలపరిచి వారిని శ్రద్ధా భక్తులతో సేవించేటట్లు చేశారు.

---

శ్రీ జట్కా ఈశ్వరయ్యగారు - శ్రీనివాస పెరుమాళ్ళ దేవస్థాన ట్రస్టీ, ఇంటినెం-6, అష్టభుజం రోడ్డు - మురుగేశవీధి మద్రాసు-112. శ్రీ స్వామివారితో తన దివ్యానుభవమును ఇలావ్రాస్తున్నారు.

నేను చిన్నప్పటినుండి మహనీయుల దర్శనం చేయాలనే కోరిక గలవాణ్ణి.

శ్రీ సొరకాయలస్వామి వారిశిష్యులకు శిష్యుడైన శ్రీ జ్యోతి స్వామివారి ఆశ్రమం తిరుత్తనిలో వుంది. అక్కడికి వెళ్ళి వస్తుండేవాడిని. ఇంటి దగ్గర దేవునికి పూజానంతరం కర్పూరహారతిచ్చాక నేనుగా విభూతి నివ్వక ప్లేటులో వేసి అందరినీ తీసుకోమని చెప్పేవాడిని. ఒక రోజున్నేను తిరుత్తని ఆశ్రమం వెళ్ళినపుడు శ్రీ స్వామివారు అందరికీ విభూతి నివ్వమని ఆజ్ఞాపించారు. అది గుర్వాజ్ఞగా భావించి అలానే చేయసాగాను.

ఒక రోజు గూడూరు సాయిబాబా మందిరం వెళ్ళి అగ్ని గుండము దగ్గర శ్రీ వెంకయ్యస్వామి వారి పటం చూచి పరవశుండనైనాను. వారిని గూర్చి విచారించగా గొలగమూడి ఆశ్రమ అడ్రసు తెలుసుకొనడం జరిగినది. అది మొదలు శ్రీ వెంకయ్యస్వామి వారి దర్శనార్థం వస్తున్నాను.

ఒక రోజు మాచెల్లెలు నెల్లూరు, తూకుమాను మిట్ట, సంతపేటలో వుంది. ఆమె బర్త యింట్లోకి వస్తూ చూడక తన భార్య గర్భానికి తన కాలు తగిలించాడు. ఆపాదం ఆమె గర్భానికి ఎక్కడ తగిలిందో తెలియదు గాని ఆమె విలవిల తన్నుకొనుచూ చాలా బాధ అనుభవిస్తుంది. నీటి బయటవేసిన చేపవలె కొట్టుకుంటుంది. ఆబాద చూడలేక అగరుబత్తి వెలిగించి శ్రీ స్వామివారిని ప్రార్థించి ఆమె బాధ నివారించమని అర్థించాను. ఒక గ్లాసులో నీరు తీసుకొని శ్రీ స్వామివారి



పటం ముందుంచి అందులో విభూతి కలిపి కొంత విభూతి ఆమె నోటిలో వేసి ఆ విభూతి నీరు త్రాగమని ఆమెకిచ్చాను. కొంత విభూతి కాలు తగిలినందున నొప్పి గల్గిన భాగంపై పూయమని యిచ్చాను. ఆమె తీర్థం త్రాగి విబూతి పూయగానే ఆమె నొప్పి మాయమై హాయిగా నిద్రపోయింది. ఆమెలో గల్గిన అమార్పునకు చుట్టు ప్రక్కలవాళ్ళంతా ఆశ్చర్యపోయారు.

పై అనుభవం కండ్లారాచూచిన ప్రక్కింటి ఆమె నిండుచూలాలు. విపరీతమైన జ్వరం. రాత్రింబవళ్ళు నిద్ర లేదు. నెల్లూరులో అనేక మంది డాక్టర్లకు చూపించి ఎన్నివైద్యాలు చేయించినా ఎంత డబ్బు ఖర్చుచేసినా నయం కాలేదు. ఒక రోజు నేను మా చెల్లెలు యింటికి పోతే ఆచూలాలు భర్త నన్ను విభూతి అడిగి తన భార్య జ్వరం సంగతి చెప్పాడు. ఆయన ముస్లిం కులానికి చెందినవాడు. ఆయన్ను ఎక్కవగా కర్పూరం తెమ్మన్నాను. కర్పూం వెలిగించి అది ఆరిపోకుండా కర్పూరం వేస్తుండమని చెప్పాను. ఊదుబత్తి వెలిగించి చక్కెర నైవేద్యం పెట్టి కొంత సేపు శ్రీ స్వామివారిని ప్రార్థించి ఆమెకు స్వస్తత చేకూర్చమని చెప్పుకొన్నాను. విబూతి యిచ్చి నోట్లోవేయమని శ్రీ స్వామికేదైనా మ్రొక్కుబడి చెప్పుకోమని చెప్పాను. చిత్రమైన అనుభవం ప్రసాదించారు శ్రీ స్వామివారు. ఆమె విభూది తిన్నది మొదలు అన్నిరోజులుగా రాత్రింబవళ్ళు నిద్రలేని ఆమె ఎంతో గాఢంగా నిద్రపోయింది. తెల్లవారి 7గం॥ లకు నిద్రలేచింది. ఈ లోగా ఎందరు లేపినా నిద్రలేవలేదు. నిద్రలేస్తూనే ఆకలిగా ఉందని ఆహారం అడిగింది. అన్నాళ్ళు ఆహారమే అడగని ఆమె చిత్రంగా ఆహారం తీసుకొని స్వస్థత పొందింది. కుటుంబమంతా వచ్చి మ్రొక్కుచెల్లించుకున్నారు. ఆమెకు శ్రీ స్వామివారు సుఖ ప్రసవం కూడా అనుగ్రహించారు. ఆడపాపను ప్రసవించింది.

మాకుమారుని స్నేహితుడు మద్రాసు నుండి బాడీ లేని లారీ బాంబే తోలుకుపోతుండగా యాక్సిడెంట్ అయి తొడలోని ఎముక విరిగింది. పుత్తూరు కట్టు కట్టించారు. కాలు విపరీతంగా వాచి వుంది. పోటోలు తీసి చూస్తే ఒక ఎముక ముక్క విరిగిన ఎముక పై వున్నట్లు తెలిసింది. నలభైవేలు యిస్తే ఆపరేషను చేస్తామన్నారు. అంత డబ్బు యివ్వలేక మానసికంగా చాలాకృంగిపోయారు. ఆవిషమపరిస్థితిలో మాచెల్లెలు నన్ను వెళ్ళి ఆయనను చూచి శ్రీ స్వామివారి విభూతి నిమ్మని తొందర చేసింది. నేను వెళ్ళి చూచాను. కాని చాలా విపరీతంగా వాచి వున్నది. శ్రీ స్వామివారి పై భారంవేసి ప్రార్థించి వారికి కొంత విభూతి నిచ్చినిత్యం ఆయన కాలుకు పూయమని కొంత నోటిలో వేసి, బొట్టు పెట్టమని ఏదైనా మ్రొక్కుకోమని చెప్పాను. అనతి కాలంలో ఏ వైద్యంలేకుండానే అతనికి స్వస్థత చేకూరింది. కాలు బాగైంది. నేడు మరలా తన డ్రైవరు వృత్తి చేస్తున్నాడు. కుటుంబ సమేతంగా వచ్చి శ్రీ స్వామివారికి తన మ్రొక్కు చెల్లించు కున్నాడు.

---

శ్రీ యుతులు పగడాల దస్తయ్యనాయుడుగారు -బురదపాళెం, ప్రకాశం జిల్లా, వీరు ఇలా వ్రాస్తున్నారు. నాభార్య వెంకటసుబ్బమ్మకు కడుపు నొప్పి, తలనొప్పి 1986సం॥లో వచ్చాయి. చాలా తీవ్రంగా బాధ పెట్టాయి. ఎమ్.బి.బి.ఎస్. డాక్టర్లకు నాటు వైద్యులకు షుమారు అరవైవేల రూపాయలు ఖర్చుచేసినా ఫలితం లేదు. ఆమె బాధ చూడలేకున్నాము. దేవుళ్ళ వెంటపడి దేవులాడే కాలంలో పరమ కారుణ్య మూర్తి యైన శ్రీస్వామివారి పుణ్యభూమియైన గొలగమూడికి వచ్చాము. ఆమెకు ఒక రోజు ఆపరేషను చేసినట్లుగాను, మరియొక రోజు ఇంజక్షను వేసినట్లుగాను స్వప్నాలు వచ్చాయి. సంవత్సరాల



తరబడి డాక్టర్లుకు అలవిగాని ఆమె బాధ పూర్తిగా తీసేసినట్లు పోయింది. అది మొదలు శ్రీ స్వామివారి యెడల గల కృతజ్ఞతాభావంతో నిత్యం ఇంటిలో శ్రీ స్వామివారి పటం పెట్టి భజన చేసుకొనుచున్నాము. ఆ మహనీయ మూర్తికి గల అపారమైన కరుణచే మాకుప్రతినిత్యం మాలో ఒకరై పోయి అనేక విధాల మాజీవితాలను నడిపిస్తున్నారు. వారి సలహాలు రక్షణ మాకు పెట్టక పెట్టిన కోటలైయున్నాయి.

శ్రీ స్వామి వారు పరమకారుణ్యమూర్తియై నిత్యం వీరు జరిపే భజన కార్యక్రమమునకు ఏతెంచి వీరినాశీర్వదించుట, వీరి సమస్యలకు సమాధానము లిచ్చుటయేగాక ఆయా సమస్యలను తీర్చుట వీరి శ్రీమతి గారైన వెంకట సుబ్బమ్మగారిని కనీసం వారమునకొక సారి శ్రీ శైలము, కాశి, గొలగమూడి వంటి పుణ్యక్షేత్రములకు తీసుకవెళ్ళి వారికి అద్భుతానుభూతు లిచ్చుచున్నారు. వారిని ఆవిధంగా తీసుకుపోయినపుడు ఆమె శరీరం స్పృహ తప్పుట అనునది ఎంతటి మహత్తర విషయమో భక్తులు ఊహించుకొన వలసిందే. ఈ మహాతల్లికి శ్రీ స్వామివారితో ఎన్నిజన్మలుగా అవినాభావ సంబంధముందో మనకెలా తెలుస్తుంది. నేడు మనం కూడా ఆమహనీయ మూర్తితో అట్టి సంబంధ మేర్పరుచుకొని సేవిస్తుంటే మన సర్వబాధ్యతలు వారే చూస్తారని మనకొక నిత్య సత్యమైన విషయం బోధిస్తున్నారు.

1986సం॥లో ఒక నాటి ఉదయం 9 1/2 గం॥ నుండి మధ్యాహ్నం 1 1/2 గం॥ వరకు వెంకటసుబ్బమ్మగారు స్పృహలేకుండా ఉన్నారు. "ఆకాలంలో తన అనుభవాల నీవిధంగా వర్ణించింది. "ఆకాశంలో పెద్దవైన నక్షత్రాలు ఎంతో సేపు చూశాను. ఆతరువాత మనచేలోకి వెళ్ళాను. అక్కడ పెద్దఅవుతన దూడకు పాలిస్తుంటే ఎంతో సేపు చూచాను". అని చెప్పింది. ఆతరువాత నేను భజన చేస్తూ

నాభార్యకు కనిపించిన దృశ్య మేమిటని శ్రీ స్వామివారిని ప్రార్థించాను. ఆగోవు కామధేనువని అది చేలోకి రావడం శుభ శూచకమని సెలవిచ్చారు.

---

పగడాల దస్తయ్యగారు బురదపాళెం.

ఒకరోజు శ్రీస్వామివారు చెప్పారు. "అయ్యానేను అరణ్యంలో మంచి ఆకలితో వస్తున్నాను ఒకచోట పెద్దామె చద్దియన్నం మూటలు పెట్టుకొని వాళ్ళ ఇలాక మనుషుల కొఱకు ఎదరుచూస్తుంది. నన్నుచూడగానె ఆమె ఆప్రక్కనున్న చెట్టు చాటుకు వెళ్ళింది. నేను మంచి ఆకలితో వున్నాను. కనుక ఒక చద్దిమూట తీసుకొని ప్రక్కనున్న నది ఒడ్డున తినేందుకు వెళ్ళాను. చద్దిమూట విప్పి చేతిలో వుంచుకొని తినేందుకు కలుపబోతున్నాను. బ్రహ్మాండముగా గాలి, వాన, ఉరుములు వచ్చి ఆ అన్నమంతా నేలపాలైపోయింది. నేను తినేందుకు ప్రాప్తం లేకుండా పోయింది." ఆనదిలో నీరు త్రాగి ఆకలి తీర్చుకోవలసి వచ్చింది. ఆచద్దిమూటను అడగకుండా ఆమెకు చెప్పకుండా తీసుకొన్న ఫలితమే ఇలా అయినది. అని సెలవిచ్చారు. ఇది మనందరికీ ఒక చక్కని పాఠమే. మన అవసరం ఎంత బలీయంగా వున్నా అనుమతి లేనిదే ఇతరుల వస్తువును మనం తాకరాదని అలా తీసుకొన్నా అది మనకు దక్కదని శ్రీ స్వామివారు ఈ లీలద్వారా బోధిస్తున్నారు.

మా పొగాకు బేరనీల ఆవరణలో రాత్రులందు ఒక్కొక్క సారి ఎంతో దుఃఖముతో కూడిన ఆర్తనాదాలు, డబ్బులు ఎంచే శబ్దాలు వినిపిస్తాయి.వీటి ద్వారా మాకు ఎలాంటి చెడు జరుగకున్నా, భయం లేకున్నా, ఇది ఏమిటబ్బా అన్న కుతూహలం వుండేది. ఒకరోజు శ్రీ స్వామివారికి విన్నవించి అదేమిటో తెలుపమని అర్థించాను.



అందుకు శ్రీ స్వామివారు ఈ క్రింది వివరాలు చెప్పారు. పూర్వమొక గొఱ్ఱెల కాపరి ఈ ప్రాంతంలో గొఱ్ఱెలు మేపుతూ మధ్యాహ్నం ప్రక్క నదిలోనికి నీటి కొఱకు గొఱ్ఱెలను తోలుకుపోయాడట. పైన ఎక్కడో వర్షం కురిసి రెప్పపాటులో ఆనదిపొంగి ప్రవహించి ఆ గొఱ్ఱెలు, గొఱ్ఱెలకాపరిని చుట్టిముట్టింది. ఆ ప్రాణాపాయ పరిస్థితిలో అతడు ఆర్తనాదం చేస్తూ మరణించాడు. అతని ప్రేతే ఇక్కడ సంచరిస్తున్నది.

ఆ ప్రాంతంలో పూర్వం కొన్ని కుమ్మరి వారి ఇండ్లు ఉండేవని, ఒకతను తన డబ్బంతా ఒక పాత్రలో ఉంచి, మా ఇండ్ల ప్రాంతంలో భూస్థాపితము చేశాడని అతడు దూరపు చుట్టాల దగ్గర కెళ్ళి చనిపోయాడని అందువలన అతని ప్రేత వచ్చి అప్పుడప్పుడు డబ్బుఎం చూచుకొంటుందని తెలిపారు.

ఈ ఆర్తనాదాలు శబ్దాలు లేకుండా చేయమని శ్రీ స్వామి వారిని ప్రార్థించాను. ఒకరోజు శ్రీ స్వామివారు మా ఆవరణం నలుమూలలా అగ్నిగుండాలు వేశారు. నాటి నుండి మాకా బాధలు వైతొలిగాయి. ఇందులో చిత్రమేమిటంటే శ్రీ స్వామివారు గుండాలు వేయడం నాభార్యకు కనపడుతుంది. నాతో సహా ఇతరులెవరికీ కనిపించలేదు.

ఒక రోజు మాట్రాక్టరు మాగ్రామానికి సమీపమందలి కొండ మీదనుండి తెల్లరాయి తోలుతుంది. ట్రాక్టరు కొండమీద నిలిపి కూలీలను రాయి ట్రాక్టరుకు వేయమని డ్రైవరు అన్నంతినాలని అన్నం తీసుకొని సమీపమందలి నీడకు వెళ్ళాడు. ట్రాక్టరుకు పది రాళ్ళువేయగానే అది చిత్రంగా కదలిపోతూవుంది. డ్రైవరు ట్రాక్టరును లాక్ చేయలేదు. అందరూ భయభ్రాంతులై అరుస్తున్నారు డ్రైవరు వచ్చేలోగా ట్రాక్టరు చాలా దూరం వెళ్ళిపోయింది. ట్రాక్టరు రోడ్డు

మీదనే మలుపులు తిరిగి పోవడం లేదు. గుంట మిట్ట లేకుండా నేరుగా దిగిపోతుంది. చిత్రాతి చిత్రంగా పెద్దగుంటలలో పడిపోకుండా ట్రాక్టరు మాత్రం దెబ్బతినకుండా షుమారు మూడుకిలోమీటర్లు దూరం ప్రయాణం చేసి భూమి మీద కొచ్చి నిలబడిపోయింది. ఈ ప్రమాదంలో

1. ట్రాక్టరు ఎవరి ప్రాణాలు నష్టపరచకుండటం.

2. ట్రాక్టరు ఏగుంటలో నైనా పడి నుగ్గు నుగ్గు కాకుండా ఎలాంటి దెబ్బ తగలకుండా సురక్షితంగా భూమికి చేరడమే చిత్రం.

ఈసంఘటన తరువాత శ్రీ స్వామివారికి విన్నవించి ఈ చిత్రమేమిటి స్వామీ అని అర్థిస్తే " అయ్యా, చూడాలని పైవాళ్లు వచ్చి చూచిపోయారులే మనకేమి నష్టం లేదుగదా!" అని సెలవిచ్చారు.

---

మా చేలో ఆముదం వేశాము. ఒక కయ్యలో కొంత భాగము పురుగు పట్టింది. అదిచేనంతా వ్యాపిస్తే నాకు అర్థికంగా చాలా నష్టం కలగడం తధ్యమని శ్రీ స్వామివారికి విన్నవించుకొన్నాను. "అదేమి చెయ్యదు, పోతుందిలేయ్య", అన్నారు. తెల్లవారికి చిత్రాతి చిత్రంగా ఆపురుగు ఎట్లాపోయిందో చెప్పలేని విధంగా చేనుకు ఆపీడ విరగడైంది.

శ్రీ స్వామివారు నాలుగురోజుల కొకమారుగాని వారము నకొక మారుగాని మా గృహమునకేతించి మమ్మాశీర్వ దించుచున్నారు. శ్రీ స్వామివారు మాగృహమునకు ఏతెంచునపుడు ప్రతిదపా మా ఎద్దు రంకెవేస్తుంది. కుక్క మొరుగుతుంది. మా భార్య ప్రత్యక్షంగా వారిని చూడగల్గుతుంది. కాని నాకుమాత్రం కనిపించరు. మిగిలిన వారికి కూడా కనిపించరు. అదిగో శ్రీ స్వామివారు వస్తున్నారు. వస్తున్నారు" అంటూ నాభార్య స్పృహ లేకుండా పడిపోతుంది. మూడు నాలుగు



గంటలవరకు అలాగే పడివుంటుంది. అలాంటి సమయములో ఆమెలో ప్రాణచలనం స్థంబించి పోతుంది. శ్వాసాడదు. కాని శరీరంలో వేడివుంటుంది. తర్వాత ఆమె స్పృహలోకి వచ్చాక తాను శ్రీస్వామివారితోటి ఒక దివ్యరథంలో శ్రీ శైలము, కాశి, గొలగమూడి వంటి క్షేత్రములకేగి అచట పూజాదికములు నిర్వర్తించుకొని వచ్చినట్లు చెపుతుంది. ఆస్థలాలను ఆమె తాను నిజంగా చూచినట్లు వర్ణించడం, ఆవర్ణనలు ఆయా స్థలాలకు సరిగ్గా సరిపోవుట చాలా చిత్రమైన విషయం. నేనొక ట్రాక్టరు కొనదలచి శ్రీ స్వామివారికి విన్నవించాను. వారు శ్రీశైలానికి వస్తే చెబుతానన్నారు. నాభార్య శ్రీ స్వామివారితో అచటికి వెళ్ళినపుడు అలాగే కొనమని అజ్ఞాపించారు. అలాగేకొనడం జరిగింది.

ట్రాక్టరు కొన్నాక దాన్ని గొలగమూడి తీసుకువెళ్ళి పూజచేయించుక రావలెనని తలచాను. కాని ట్రాక్టరు రిజిస్ట్రేషనుకు సంబంధించిన కాగితములు యింకా చేతికి రాలేదు. ఈ విషయం శ్రీ స్వామివారికి విన్నవించాను. "అయ్యా ఒక్కచోట కొంచం యిబ్బందికలుగుతుంది. అదేమి చేయదు నేనున్నానుగా, గొలగమూడికి బండి తీసుకరండి ఏం పరవాలేదు." అని సెలవిచ్చారు. నేనదేవిధంగా పదిమందిని ట్రాక్టరులో ఎక్కించుకొని గొలగమూడి వస్తున్నాను. ఒక చోట ఆర్.టి.ఓ. రోడ్డు వెంబడి లారీలను, కార్లను షుమారు రెండు కిలోమీటర్ల దూరం వరకు ఆపివేసి ప్రతిబండి లైసెన్సులు చెక్ చేస్తున్నారు. మేము వస్తుంటే లారీడ్రైవర్లు విషయం చెప్పారు. మాదగ్గర అసలు లైసెన్సు కాగితాలే లేవు గదాఎట్లా చేయడం. సరే శ్రీ స్వామివారున్నారు ఏమైతే అది అయింది. బండి ముందుకు పోనీమన్నాను. డ్రైవరు భయంతో వణికిపోతున్నాడు. నాధైర్యం చూచి బండి పోనిచ్చాడు. చిత్రం మాబండి ఆర్.టి.ఓ. ను దాటేటప్పుడు

ఆయన ఎందుకోగాని మరొక ప్రక్కకు తిరిగి ఏదోకాగితాలు చూస్తున్నాడు. వారి సిబ్బంది ఎవ్వరూ బండిని ఆపలేదు. సురక్షితంగా గొలగమూడి వచ్చి పూజలు చేయించుకొని వెళ్ళాము.

శ్రీ స్వామివారు ఆక్షణంలో ఆర్.టి.ఓ. డిపార్టుమెంటు వారికి మాబండి కనబడకుండా చేశారో లేక ఏమిచేశారో తెలియదుగాని మాబండిని మాత్రం ఆపలేదు.

మాగ్రామము లోని లింగం గుంట చేనుకొనాలని ప్రయత్నించాను. దాన్ని 50వేలరూపాయలకు తీర్మానించుకొని అడ్వాన్సుకూడా యిచ్చాను. ఆతరువాత ఆచేను 1 1/2 లక్షల రూపాయలకు ధర వచ్చింది. కనుక తనకా చేను యిచ్చే సూచనలు లేవు. వృధాగా నా అడ్వాన్సు పోవడం తప్ప ప్రయోజనం లేదనిపించింది. శ్రీ స్వామివారికి విన్నవించుకొంటే ఎల్లుండి రాత్రి 1 1/2 గంటలకు వచ్చి నిద్రలేపుతారు. రిజిష్టరు చేయించుకో అని తెలిపారు. అదేవిధంగా అర్ధరాత్రి వేళ వచ్చి నిద్రలేపి ఉదయం రిజిష్టరు చేయించుకోమని తెలిపారు. అమ్మే ఆయన ఆశకు లోబడక శ్రీ స్వామివారి భక్తునకు రిజిష్టరు చేశారు.

స్వామి! కుక్కకు, ఎద్దుకు కూడా దర్శనమిస్తున్నారు నాకేల కన్పించరని ఒకరోజు ప్రార్థించాను. ఆరోజు స్వప్నంలో శ్రీ స్వామివారు "అయ్యానీవు అడగకూడదు. నీకునేను కనపడకూడదు అని సెలవిచ్చారు.

---

ఎన్. వెంకటేశ్వర్లు - ఇరగాళమ్మ సంగం నెల్లూరు. నాకు ఉన్నట్లుండి మెంటల్ వచ్చి అందరినీ రాళ్ళతో కొట్టేవాడిని పిచ్చిపిచ్చిగా నడచుకొనేది. నెల్లూరు రామచంద్రారెడ్డి ఆస్పత్రి ఎదురుగా వుండే మెంటల్ ఆసుపత్రికి తీసుకపోయారు. అచ్చట వైద్యము చేయించినా



నెమ్మదించలేదు. వెంటనే నా స్నేహితుల ప్రోద్భలముతో గొలగమూడి తీసుకొచ్చారు. తొలిరోజు నిద్రపట్టి కొద్దిగా నెమ్మదించింది. క్రమేణా రెండు రోజులలో పూర్తిగా స్వస్థత చేకూరింది. నేను బొమ్మలకు రంగులు వేసేవృత్తి చేస్తాను. వరికొండదేవాలయానికి రంగులువేశాను. ప్రస్తుతం నావృత్తి చేసుకోగలుగుచున్నాను. అంతా శ్రీ స్వామివారి దయ వారికి నేనెంతో ఋణపడియున్నాను.

---

నెల్లూరు జిల్లా కోటమండలం మెట్టుగ్రామ నివాసి శ్రీ సి.రాజా రాంరెడ్డిగారు తనను శ్రీ స్వామి వారు ఆపదలో ఆదుకొన్న విషయం ఇలాచెపుతున్నారు.

1993 సం॥ సెప్టంబరు నెలలో నేను నాకుమారుడు నాగూర్ రెడ్డి గొలగమూడికి శ్రీ స్వామి వారిదర్శనార్థం వచ్చి, నాకుమారుడు భజన మందిరంలో భజన చేస్తున్నాడు, నేను నామిత్రుని ఇంట్లో నిద్రపోతున్నాను. రాత్రి 10గం. 45ని॥కు నాకుమారునికి గుండె నొప్పి వచ్చి భజన మందిరంలో పడిపోయాడు. మైక్‌లో ఎంతసేపు పిలచినా నిద్రలో ఉన్న నాకు తెలియలేదు. రాత్రి 12గం॥లకు నేను ఎవరో లేపినట్లుగా లేచి నాకుమారుడెక్కడున్నాడా అని వెతుకుతూ నామిత్రుడు గోపాల్‌రెడ్డి గారింటికి వెళ్ళాను. ఒక పిల్లవాడు పడిపోయాడని జండుబామ్ రద్దుతూ జనం గుంపులు కూడియున్నారు. చూస్తే ఆపిల్లవాడు నాకుమారుడే. పిల్లవాడు చాలా అపాయ పరిస్థితిలో ఉన్నాడు. నెల్లూరు తీసుక పోవుటకు ఆసమయంలో ఎలాంటి వాహన వసతి లేదు. ఆగ్రామంలో డాక్టరులేడు, ఏమిచేయాలా అని దిగుల్లో ఉన్నాను.

ఇంతలో ఒక ముసలాయన 'గుండె నొప్పి వచ్చిన పిల్లవాడేడి?' ' అని అడుగుతూ నేరుగా జనాన్ని నెట్టుకొని పిల్లవాని దగ్గరకొచ్చి ఇప్పుడు రెండు తెల్లవారి రెండు వేయండి, నొప్పి వెంటనే తగ్గిపోతుందనిచెప్పి నాలుగు హోమియో మాత్రలో నాచేతిలో పెట్టి వెళ్ళాడు. రెండు మాత్రలు వేసిన వెంటనే పిల్లవాని నొప్పితగ్గి లేచికూర్చున్నాడు. ఆ మాత్రలిచ్చిన మనిషి కొరకు ఎంత వెతికినా కనిపించలేదు. అమహనీయుడు ఆపద్బాంధవుడైన శ్రీ స్వామి వారు గాక మరెవరై ఉండగలరు ! ఆపద్బాంధవాయనమః

---

నెల్లూరు జిల్లా విద్యానగర్ - లెక్చరర్ శ్రీ జె. గోవిందప్ప గారి అనుభవం సామాన్యులకు చాలా కాకతాళీయంగా జరిగినట్లు తోచవచ్చు, కానీ "వెయ్యి గెత్తెల లోనున్న మన గొత్తెను కాలు బట్టి లాక్కొస్తానని శ్రీస్వామివారిచ్చిన అభయం వీరిపట్ల చక్కగా వర్తిస్తుంది. 1982 వసం॥ నుండి 1997వసం॥ వరకు ఎప్పుడో వచ్చి వెళ్ళేరటగాని శ్రీ స్వామివారి ఎడల తీవ్రమైన భక్తిభావం కలుగలేదు. ఈ అనుభవం తర్వాత వారికి శ్రీ స్వామివారి పైగల్గిన భక్తిభావమే ఇది శ్రీ స్వామివారి అదృస్య హస్త ప్రభావమని తెలుస్తుంది.

వారు సాయంకాలం 5 1/2 గం॥లకు తప్పక విద్యానగర్ వెళ్లవలసి ఉంది. నాదగ్గర సెలవుతీసుకొని వెళ్ళేసరికి సాయంత్రం 4 గం॥ అయింది మరి 5 1/2 గం॥లకు విద్యానగర్ వెళ్ళడమెట్లా, 4గం॥ 10 ని. వరకు గొలగమూడిలో ఏ వాహన వసతిలేదు. ఏమిచేసినా నీదే భారం స్వామి అనుకుంటూ నిలచియున్న తనముందు ఏ.సి. కారు వచ్చి నిలబడి వస్తారా అని అడిగారు. ఎక్కి కూర్చున్నారు. రెండు కిలోమీటర్లు పోగానే ఎదురుగా వచ్చేలారీ కారు ప్రక్కనున్న అద్దాన్ని



పగులగొట్టి పోతుంది. డ్రైవరు కారు వెనక్కు త్రిప్పి పోయి లారీని ఆపాలన్నా ఓనర్ అంగీకరించక ప్రయాణం సాగించారు. మద్యలో ఆకారు సూళ్ళూరుపేట పోతుందని వారు విద్యానగర్ రోడ్డువరకు రావచ్చని చెప్పారు. అంతే గాక తాను ప్రతిదపా ఎవరైనా భక్తులను ఎక్కించుకుపోతానని ఈ ధపా వారిని మాత్రమే తీసుకుపోతున్నానని చెప్పాడు 4గం॥ 45ని॥ విద్యానగర్ చీలురోడ్డులో దిగాడు.

అక్కడ ఒకబస్సు వచ్చి నిలుపకుండానే వెళ్ళాడు. శ్రీ స్వామినిస్మరిస్తూ నిలుచున్నాడు. టీ త్రాగుతున్నాడు. ఇంతలో లారీ వచ్చింది నలుగురు పాసింజర్లను ఎక్కించు కొని వెళ్ళి పోతుంది. టీగ్లాసు నోటి దగ్గరుంది. పదిబారల దూరం వెళ్ళి డ్రైవర్ లారీ నిలిపి ప్రక్కకు చూచాడు. వీరు తానొస్తున్నట్లు చేత్తో సైగచేసి టీత్రాగి వెళ్ళి లారీ ఎక్కాడు. సరిగ్గా 5గం॥ 30ని॥లకే ఇల్లు చేరారు. ఈ ప్రయాణం కేవలం శ్రీ స్వామి కృపగాక మరే మీకాదంటారు గోవిందప్పగారు. ఈసన్నివేశం ద్వారా వీరి హృదయంలో నాటిన భక్త భీజమే, విశ్వాసబీజమే ఇది శ్రీ స్వామి వారిలీల అనేందుకు కారణమని విశ్వసిస్తున్నారు గోవిందప్పగారు.

---

1. "అందరికీ పంట పండించాను దొంగలు పడి దోచుకోకుండా చూచుకోండి"

2. "సత్యం ధర్మం తప్పవద్దు. సద్గురు సేవసాధించు"

భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి

## ప్రతినిత్యం గొలగమూడిలో మూడు వేళలా పూజానంతరం పాడే హారతి పాటలు

1. మంగళం గురుదేవాయ మహనీయ గుణాత్మనే
సర్వలోకశరణ్యాయ సాధురూపాయ మంగళం
మంగళం వేదవేద్యాయ మేఘస్యామలామూర్తయే
పుంసాం మోహన రూపాయ పుణ్యశ్లోకాయ మంగళం
రామ చంద్రాయ మంగళం, రామకృష్ణాయ మంగళం
గురుదేవాయ మంగళం, సద్గురు దేవాయ మంగళం.

2. స్వామి వెంకయార్యాయ గొలగమూడి వాసాయ
మామకాభీష్టదాయ మహిత మంగళం.
లోకనాథాయ భక్తలోక సంరక్షకాయ
మామకాభీష్టదాయ మహితమంగళం ॥స్వామి॥
భక్త బృంధ వందితాయ బ్రహ్మస్వరూపాయ
మామ కాభీష్టదాయ మహిత మంగళం ॥స్వామి॥
సత్య తత్వ బోధకాయ సాధురూపాయతే
నిత్య మంగళదాయకాయ నిత్యమంగళం ॥స్వామి॥



## మా ఇతర గ్రంథములు

1. అవధూతలీల 35రూ. స్వామివారి జీవితచరిత్ర
2. శ్రీ స్వామి సన్నిది 15రూ.
3. అవధూత బోధామృతము 12రూ.
4. స్వామి కృప 1-50 పై
5. అవదూత లీల ఇంగ్లీషు 30రూ.

ప్రాప్తిస్థానము : శ్రీ స్వామి కృప పబ్లికేషన్స్
పెసలసుబ్బరామయ్య ,
గొలగమూడి, నెల్లూరు జిల్లా 524 321.

---

నోట్ :- శ్రీ స్వామివారికి దక్షిణపంపేవారు
దిరిసీవర్ - భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి
హ్యూమేని టేరియన్ మిషన్,
గొలగమూడి (పి.ఓ.)
నెల్లూరు జిల్లా - 524 321.
అడ్రసుకు పంపమనవి. వ్యక్తులపేర్లతో పంపరాదు.